కుళాయిల్లో అవినీతి ధార

- ఫైసలిస్తే చాలు అనధికార ట్యాప్ ఉన్నా రైట్ రైట్
- అపార్ట్‌మెంట్స్‌కు కూడా దొంగ కనెక్షన్లు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు
- రెండు లక్షల ఫైచిలుకు అసెస్‌మెంట్లకు లక్ష మాత్రమే ట్యాప్ కనెక్షన్లు ఉన్న వైనం



నగరంలో అనధికార ట్యాప్‌ను కట్ చేస్తున్న సిబ్బంది

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార ట్యాప్‌లు రాజ్యమేలుతున్నాయి. పైసలిస్తే నగరపాలక సంస్థ సిబ్బంది వాటి జోలికి పోవడం లేదు. ట్యాప్ వర్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ప్రస్తుత వార్డు ఎమినిటటీ సెక్రటరీలు తమకు ఇష్టం వచ్చినట్లుగా అధికారుల అండదండలతో వాటర్ ట్యాప్ కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. భారీగా నగరపాలక సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారు. గుంటూరు నగరపాలక సంస్థలో 2,01,788 లక్షల ఇంటి పన్నుల అసెస్‌మెంట్లు ఉంటే ట్యాప్ కనెక్షన్లు అధికారంగా ఉన్నవి 1,12,186 మాత్రమే ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నగరపాలక సంస్థలో విలీనమైన ప్రాంతాలు, టెయిల్ ఎండ్ ప్రాంతాల్లో కూడా విచ్చలవిడిగా కనెక్షన్లు అనధికారికంగా ఇవ్వడంతో వివరాల్లో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది.

అపార్ట్‌మెంట్స్‌కు అనధికార కనెక్షన్లు

నగరంలో అపార్ట్‌మెంట్స్, హాస్పిటల్స్‌కు, ఇతర కమర్షియల్ భవనాలకు కూడా అనధికార ట్యాప్ కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. నగరంలో కమర్షియల్ బిల్డింగ్ అధిక సంఖ్యలో ఉంటాయి. వీటికి తప్పనిసరిగా నీటి మీటర్ అమర్చాలి. ప్రతి నెలా వాటర్ చార్జీలు వసూలు చేయాల్సి ఉంటుంది. కాని నగరపాలక సంస్థ లెక్కల ప్రకారం చూస్తే గుంటూరు నగరంలో కేవలం 4,111 మాత్రమే కమర్షియల్ భవనాలు ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. స్వయంగా కమిషనర్ పర్యటనలో అనధికార ట్యాపులు గుర్తించినప్పటికీ అధికారుల్లో ఎటువంటి చలనం లేదు.

రెగ్యులరైజ్ పేరుతో దోపిడీ

ఇటీవల కొన్ని ప్రాంతాల్లో బయట పడిన అనధికార ట్యాపులను రెగ్యులరైజ్ పేరుతో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది దోచుకునే పనిలో పడ్డారు. ఇంత కాలం ట్యాప్‌లు వినియోగించుకున్నారు...దీనికి ఇంత కట్టాలని గుండె పగిలే అమౌంట్ చెప్పడంతో నగర వాసులు నీళ్ల నమాల్సిన పరిస్థితి నెలకొంది. కేవీపీ కాలనీ, ఏటీ అగ్రహారం, నల్లచెరువు, కాకాని రోడ్డు, పొన్నూరు రోడ్డు, ఇలా తదితర ప్రాంతాల్లో అనధికార ట్యాపులను గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు వాటిని తీరిగ్గా రెగ్యులరైజ్ చేస్తున్నారు.

ప్రజల సొమ్ముకు లెక్క చెప్పాల్సిందే !

- బుడమేరు వరదల పేరుతో కమిషనర్ దోపిడీ
- దోచుకున్న ప్రతి రూపాయి కార్పొరేషన్‌కు జమ చేయాలి
- సమావేశంలో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు



నెహ్రూనగర్: విజయవాడ బుడమేరు వరదల సాయం పేరుతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రూ.9.24కోట్లు దోచేశారని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఆరోపించారు. అది ప్రజల సొమ్మని దీనికి తప్పనిసరిగా కమిషనర్ లెక్క చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. బుడమేరు వరదలకు సంబంధించిన ఫైల్ తన కార్యాలయానికి సర్కులేట్ చేశారని కమిషనర్ అబద్ధాలు చెప్పడంపై మండిపడ్డారు. దీనికి అనుగుణంగా గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటానని తెలిపారు. వరదల్లో ఖర్చు పెట్టిన పూర్తి వివరాలను తనకు అందజేయాలని ముందుగానే చెప్పినట్లు మేయర్ కార్పొరేషన్ కార్యాలయంలో మూడున్నర గంటలకుపైగా కమిషనర్ కోసం వేచి చూశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత 15 రోజుల నుంచి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరితే...ఎక్కడ తాను చేసిన అవినీతి బయట పడుతుందో అని భయాందోళనతో కమిషనర్ ఉన్నారని ఆరోపించారు.

డెప్యూటీ మేయర్ లేఖ రాసిన మాట వాస్తవం కాదా ?

వరదల సాయంపై కౌన్సిల్ పరంగా చర్చించాలని, అందుకు సమావేశం ఏర్పాటు చేయాలని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు) లేఖ ఇచ్చిన మాట వాస్తవం కాదా ? అని కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనిక కమిషనర్ స్పందించలేదని తెలిపారు. కౌన్సిల్‌కు సంబంధం లేకుండా 13లక్షల పాల ప్యాకెట్లు, 17.50లక్షల ఫుడ్ ప్యాకెట్లు, 4 లక్షల వాటర్ బాటిళ్లు విజయవాడకు పంపించారంటే అక్కడే కమిషనర్ చేసిన అవినీతి అర్థమవుతుందని తెలిపారు. వస్తువులను విజయవాడకు ఏ ట్రాన్స్‌పోర్ట్‌లో పంపించారనే లెక్కలు చెప్పాల్సిందేనని గట్టిగా నిలదీశారు. ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందనే కమిషనర్‌తేలు కుట్టిన దొంగలాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేషన్ నుంచి కమిషనర్ దోచుకున్న ప్రజల డబ్బులను తిరిగి జమ చేయించే దాకా ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

మేయర్ చాంబర్‌లో సిబ్బంది తొలగింపు

నెహ్రూనగర్: జనవరి 4న జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకపోగా, కౌన్సిల్ నుంచి వాకౌట్ చేసి వెళ్లిపోయిన కమిషనర్ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మేయర్, డెప్యూటీ మేయర్ల వద్ద పనిచేసే సిబ్బందిని తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం నగరపాలక సంస్థ మేయర్ చాంబర్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అటెండర్లను కమిషనర్ తొలగించారు. ఒకరిని ఉపాసెల్‌కు, మరొకరిని సెక్రటరీకి అటెండర్‌గా ఉండాలని కమిషనర్ ఆదేశించడంతో కార్యాలయ మేనేజర్ బాలాజీ బాషా సిబ్బందిని మేయర్ చాంబర్ నుంచి తప్పించారు. మేయర్ చాంబర్‌కు అటెండర్‌ను కేటాయించారు..అతను కార్యాలయంతో పాటు మేయర్ చాంబర్‌లో అటెండర్‌గా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ విషయం తెలుసుకున్న మేయర్ కావటి కంగుతిన్నారు. కార్యాలయ మేనేజర్ బాలాజీ బాషాను, కౌన్సిల్ సెక్రటరీ శ్రీనివాసులును పిలిపించి మాట్లాడారు. చాంబర్‌లో ఉండాల్సిన అటెండర్‌ను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. కమిషనర్ ఆదేశాల మేరకు తొలగించామని వారు చెప్పడంతో తనకు అసలు నగరపాలక సంస్థ నుంచి సిబ్బంది ఉండాల్సిన అవసరం లేదని..ఉన్న ఒక్క అటెండర్‌ను కూడా తీసుకోండని మేయర్ స్పష్టం చేశారు.

పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పిలుపు



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజారు: నిరుపేద కుటుంబాల విద్యార్థులను ఆదుకునేందుకు విరివిగా దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. ఏఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యద్దనపల్లి బాలరాజు ఆధ్వర్యంలో గురువారం నల్లచెరువు మదరసాలోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ఎవరి తలరాతనైనా మార్చగలిగే శక్తి ఒక్క విద్యకు మాత్రమే ఉందని తెలిపారు. నల్లచెరువు ప్రాంతంలోని ఒక సామాన్య కుటుంబానికి చెందిన యద్దనపల్లి బాలరాజు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ ప్రత్యేకించి యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నల్లచెరువు మదరసా నిర్వాహకులు ముఫ్తీ బాసిత్, ముఫ్తీ మన్సూర్, ఆదం షఫి, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు షేక్ రోషన్, పాపతోటి అంబేడ్కర్, దూపాటి వంశీ, బూసి రాజలత తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పెయింటర్ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాడీపేట 2/20కు చెందిన బి.ప్రేమ్‌కుమార్ (47) పెయింటింగ్ పనులకు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 19న పాత గుంటూరు పరిధిలోని ఓ భవనం మూడో అంతస్తులో పెయింటింగ్ వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగంగా మద్యం తాగుతున్న ఇద్దరిపై కేసు

లక్ష్మీపురం: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి స్థానికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఇద్దరిపై గురువారం పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం స్టేషన్ కానిస్టేబుల్ శివనాగరాజు, హెడ్ కానిస్టేబుల్ పి.ప్రసాదరావు నేతాజీనగర్ మెయిన్ రోడ్డులో విజిబుల్ పోలీసింగ్ చేస్తున్నారు. అదే సమయంలో అక్కడ షేక్ ఇబ్రహీం, షేక్ ఖాదర్ బాషా బహిరంగంగా మద్యం తాగుతున్నారు. గట్టి గట్టిగా కేకలు వేస్తూ స్థానికులు, వాహనదారులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఇద్దరిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

జీజీహెచ్ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

గుంటూరు మెడికల్: చేయూత ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ యువ నాయకుడు జల్లి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు గుంటూరు జీజీహెచ్‌లో గురువారం నిర్వహించారు.గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం గుంటూరు జీజీహెచ్ పారిశుధ్య కార్మికులు 200 మందికీ ఆయన చీరలు పంపిణీ చేశారు.

కార్మిక,కర్షక, ప్రజా శ్రేయస్సే లక్ష్యం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

లక్ష్మీపురం: కార్మిక, కర్షక, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తూ శత వార్షికోత్సవాల సభలు జరుపుకుంటున్న పార్టీ సీపీఐ అని రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో గురువారం సీపీఐ జిల్లా సమితి సభ్యుల, ప్రజా సంఘాల ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశాన్ని జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ పార్టీ స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న పార్టీగా అవతరించింది మాత్రం 1947 తరువాతేనని, కానీ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి జాతీయ ఉద్యమంలో పాల్గొని 100 సంవత్సరాలు పైగానే గడుస్తోందని తెలిపారు. పార్టీ బలపడడానికి ప్రతి ఒక్క కార్యకర్తా దీక్షతో కష్టపడి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు జగత్ సింగ్ దలేవాల్‌కు మద్దతుగా, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని ఈనెల 25న నగరంలో నిరసన తెలపనున్నట్లు చెప్పారు. అన్ని మండల కేంద్రాలలో 26న జరిగే కార్యక్రమంలో కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో గురువారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ మూసివేస్తూ ప్రైవేటీకరణ చేస్తున్న మోదీ ప్రభుత్వం వ్యతిరేకంగా యువత ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ధనవంతులకు బ్యాంకు రుణాలు రుణమాఫీ చేస్తూ ప్రజలపై భారం మోపడం సిగ్గుచేటు అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య, షేక్ వలి మాట్లాడుతూ ఏఐవైఎఫ్ 22 రాష్ట్ర మహా సభలను ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వర్సిటీ ఉద్యోగులకు ఐరన్ బీరువాలు అందజేత



బీరువాలను ఉద్యోగులకు అందజేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: వర్సిటీలో వివిధ విభాగాలు, ఉద్యోగులకు అవసరమైన ఐరన్ బీరువాలను గురువారం వీసీ ఆచార్య కె. గంగాధర రావు, రెక్టార్ ఆచార్య కె. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వినియోగించకుండా స్క్రాప్ కింద ఉంచిన ఐరన్ బీరువాలను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. వీటితోపాటు ఇనుప మంచాలు, కుర్చీలను కూడా వినియోగంలోనికి తెచ్చారు. ఐరన్ మంచాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో వర్సిటీ కమిటీని నియమించింది. నిరుపయోగంగా ఉన్న సామాగ్రిని పరిశీలించి వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే 60 బీరువాలను వినియోగంలోకి వచ్చేలా మరమ్మతులు చేయించారు. మిగిలిన ఇనుప మంచాలను, కుర్చీలను కూడా అవసరమైన మేరకు ఆయా విభాగాలకు, సెక్షన్‌లకు అవసరానికి తగినట్లుగా అందజేయనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. మరమ్మతులు చేయించడం వల్ల లక్షలాది రూపాయలు వృథా కాకుండా నివారించగలిగినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య రవికుమార్, సీడీసీ డీన్ ఆచార్య వి.రవికుమార్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. వెంకటేశ్వరరావు, సీఈ ఆలపాటి శివప్రసాదరావు, రెడ్డి ప్రకాశరావు పాల్గొన్నారు.

ఏసీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం



నాక్ టీంతో కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో నాక్ బృంద రెండు రోజుల పర్యటన గురువారం ముగిసింది. నాక్ టీం చైర్‌పర్సన్ డాక్టర్ అమిత్ మిట్టల్, మెంబర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ద్విజన్ శర్మ, సభ్యుడు ప్రమోద్ పాట్రికర్ కళాశాలలో బోధన, మౌలిక వసతులను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మలపాటి మోజెస్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ సీఎం వినయ్‌తేజ కళాశాల ప్రగతి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అన్ని విభాగాలను నాక్ టీం సందర్శించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో వేర్వేరుగా సమావేశమై కళాశాల పురోగతిని తెలుసుకున్నారు. కళాశాల విద్య ఆర్జేడీ డాక్టర్ కళావతి, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కేఏఫ్ పరదేశిబాబు, కోశాధికారి కె. మోజెస్ ఆర్నాల్డ్ కళాశాల అభివృద్ధి గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ మాట్లాడుతూ నాక్ టీం పర్యటన దృష్ట్యా గత కొన్ని నెలలుగా పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది విశేషంగా కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎజ్రా విజయశేఖర్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రీతం ప్రకాష్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఎంఎస్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఏబీసీ సెంటర్ నిర్వహణపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదు



సెంటర్‌ను పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌లో సర్జరీల నిర్వహణపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. ఏబీసీ సెంటర్‌పై వస్తున్న ఫిర్యాదులపై గురువారం ఉదయం నగరంలోని ఏటుకూరి రోడ్డులోని ఏబీసీ సెంటర్‌ను, ప్రజారోగ్యాధికారులతో, జంతు ప్రేమికులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. తొలుత స్టెరిలైజేషన్ సెంటర్ సర్జరీలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కుక్కలకు నిర్వహిస్తున్న సర్జరీల విషయంలో డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం సర్జరీ తర్వాత ఏడు రోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచాలన్నారు. అనంతరం కుక్కను ఎక్కడి నుంచి పట్టుకొచ్చారో అక్కడే వదిలేయాలని చెప్పారు. స్టెరిలైజేషన్ సెంటర్‌లో పరిశుభ్రత పాటించాలని, ఆపరేషన్ అనంతరం సంరక్షణ సమయంలో కుక్కలకు తగిన ఆహారం అందిస్తూ, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాండ్రుకుంట గురవయ్య, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జంతు ప్రేమికులు, వెటర్నరీ డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: ప్రజారోగ్యానికి, పారిశుద్ధ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరంలో ఇంటింటి చెత్త సేకరణ, ఖాళీ స్థల యజమానులకు నోటీసులు జారీ చేయడంలో శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కమిషనర్ గురువారం శ్రీరామ్ నగర్, ఎస్జీఓ కాలనీ, ఏటీ అగ్రహారం, సాయి నగర్, దుర్గా నగర్, కేవీపీ కాలనీ, కావేరి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఎంహెచ్ఓ, సీఎంఓహెచ్‌లు రోజు ఉదయం, మధ్యాహ్నం క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల అశుభ్రంపై ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. వార్డ్ సచివాలయాల వారీగా ఖాళీ స్థలాల యజమానులను గుర్తించాలని, వారు స్పందించని పక్షంలో స్థలాల్లో జీఎంసీ బోర్డ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగర ప్రజలు గుంటూరు నగరాన్ని సుందర, శుభ్రమైన నగరంగా తీర్చిదిద్దుకోవడానికి నగరపాలక సంస్థకు సహకరించాలని ఆయన కోరారు. తమ ఇంటి ముందుకు చెత్త తీసుకోవడానికి ప్రజారోగ్య కార్మికులు రాకుంటే జీఎంసీ కాల్ సెంటర్ 0863-23451036కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అనంతరం కేవీపీ కాలనీలోని జీఎంసీ వెహికిల్ షెడ్‌ని పరిశీలించారు. షెడ్ పరిసరాల్లో సీసీ ఫ్లాట్ ఫారం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వాహనాలను క్రమ పద్ధతిలో ఉంచడంతో పాటు మరమ్మతులను ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ మధుసూదన్, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నగరపాలక సంస్థలో పని చేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిర్వహించే గ్రీవెన్స్‌కు అందే ఫిర్యాదులు, అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్మికుల ప్రత్యేక గ్రీవెన్స్‌ను కమిషనర్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విభాగాల వారీగా కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గాంధీ పార్క్‌లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్‌ని వర్క్ ఔట్ సోర్సింగ్ కాకుండా ఔట్ సోర్సింగ్‌లో టెండర్ పిలిచి, కనీస వేతనాలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ మహిళా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు నగరపాలక సంస్థ డిస్పెన్సరీలో విధులు కేటాయించాలని కోరారు. పారిశుద్ధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్లుగా విధులు కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, వివిధ విభాగ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

నగరంలోని మూడు వంతెనల వద్ద పైప్‌లైన్ మరమ్మతు పనులను నిర్దేశిత గడువుకి ముందే పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన వంతెనల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల వేగవంతంపై ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనులను రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ కల్యాణరావు, ఏఈ మధు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి

లక్ష్మీపురం: మద్యం మత్తులో మామపై అల్లుడి దాడి చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిటిపాడు రామన్నపేట 2వ లైన్‌కు చెందిన బత్తుల నాగేంద్రమ్మ కుమార్తెకు తమ్ముడు దేరంగుల రాంబాబుతో 12 సంవత్సరాల కిందట వివాహమైంది. అప్పటి నుంచి ఎలాంటి పని చేయకుండా చెడు వ్యసనాలకు అలవాటు పడి భార్యను వేధిస్తుంటాడు. పలుమార్లు నాగేంద్రమ్మ నచ్చచెప్పే ప్రయత్నం చేసిన వినకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నాడు. అయితే, ఈనెల 19న రాత్రి రాంబాబు, నాగేంద్రమ్మ భర్త శ్రీనివాసరావులు కలిసి మద్యం తాగారు. మాటామాట పెరిగి శ్రీనివాసరావుపై రాంబాబు దాడి చేసి గాయాలు పాలు చేశాడు. నాగేంద్రమ్మ భర్త శ్రీనివాసరావును ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స నిమిత్తం తీసుకు వెళ్లింది. చికిత్స అనంతరం గురువారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

25, 26న గాయత్రీ దీప మహాయజ్ఞం

పొన్నూరు: అఖిల విశ్వ గాయత్రీ పరివార్ పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో పట్టణంలోని శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానం ప్రాంగణంలో 24 దీపాలతో గాయత్రి దీప మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు కలశ శోభాయాత్ర, సాయంత్రం 6 గంటలకు 2,400 దీపాలతో దీప మహాయజ్ఞం, ఆదివారం ఉదయం 7 గంటలకు గోపూజ, 8 గంటల నుంచి గాయత్రి మహాయజ్ఞం జరుగుతుందని తెలిపారు.

9న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో పాటు రజతోత్సవ వేడుకలను ఫిబ్రవరి 9న నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణ ప్రభు తెలిపారు. గురువారం కళాశాలలో కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ 1999లో తొమ్మిది మంది విద్యార్థులతో ప్రారంభించిన కళాశాల గత పాతికేళ్లలో వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యశించి, వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. ఫిబ్రవరి 9న మూడువేల మంది పూర్వ విద్యార్థులతో సమ్మేళనంతో పాటు రజతోత్సవ వేడుకలను కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిలలో ఉన్న పూర్వ విద్యార్థులను సత్కరించడంతో పాటు ప్రతిభావంతులైన విద్యార్థులకు పతకాలను బహూకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యుడు కర్పూరపు సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అధ్యాపకులు చంద్రశేఖర్, ఇందిర, భవాని, దుర్గ, రాజరాజేశ్వరి, మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముందస్తు జాగ్రత్తలతో గర్భిణులకు సుఖ ప్రసవం



గుంటూరు మెడికల్: ప్రపంచ ప్రసూతి ఆరోగ్య అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గుంటూరు జీజీహెచ్‌లో గైనకాలజీ వైద్య విభాగంలో చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, జీజీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గైనకాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ వి.అరుణ మాట్లాడుతూ గర్భం దాల్చగానే ప్రతి ఒక్కరూ ముందస్తుగా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సుఖ ప్రసవం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా తేలికపాటి వ్యాయామాలు చేయాలని తెలిపారు. పనులు చేసేటప్పుడ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మందులు వైద్యుల పర్యవేక్షణలో మింగాలని, మనస్సును ప్రశాంతంగా ఉంచుకునేందుకు ధ్యానం, యోగ, చేయాలని సూచించారు. కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ డి.రాజేష్‌బాబు, పలువురు విద్యార్థులు, గైనకాలజీ వైద్యులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



గుంటూరు మెడికల్: బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వక్కలగడ్డ తిరుమలరావు, మల్లాల లక్ష్మీనారాయణ, మలిశెట్టి పవన్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నేతలు అరండల్ పేట, పట్నంబజార్, నాజ్ సెంటర్‌లోని బోస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ఆజాద్ హింద్ ఫౌజ్ పేరుతో భారతదేశానికి మొట్టమొదటి ఆర్మీని ఏర్పాటు చేసి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన స్వాతంత్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దారా అంబేద్కర్, పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, దర్శనపు శ్రీనివాస్, నేరెళ్ల మాధవరావు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్స్‌కు చేరువలో క్రికెట్ పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: గోరంట్ల భాష్యం రామసేతు క్యాంపస్ సమీపంలోని జేఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహిస్తున్న భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ సెమీ ఫైనల్స్‌కు చేరువైంది. గురువారం ఉదయం నరసరావుపేట నింజాస్, గుంటూరు జెయింట్స్-3 జట్టుకు మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లో నరసరావుపేట నింజాస్ విజయం సాధించింది. మధ్యాహ్నం గుంటూరు గ్లాడియేటర్స్-1 జట్టుతో జరిగిన మ్యాచ్‌లో వైజాగ్ వెలాసిటీ జట్టు-3 గెలుపొందింది. పోటీల్లో గెలుపొందిన జట్టుకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిటీని నియమించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణ కోసం తక్షణమే 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో జేసీ భార్గవ్ తేజను కలిసిన యూటీఎఫ్ ప్రతినిధుల బృందం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలతో వినతి పత్రం సమర్పించారు. 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలతో పాటు డీఏ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగులకు మ్యాచింగ్ గ్రాంటు, ఏపీజీఎల్ఐ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని కోరారు. జేసీని కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్ .ఆదినారాయణ, ఎం. గోవిందు, బి. ప్రసాద్ పాల్గొన్నారు.